

ఎమ్మెల్యే సత్యనారాయణను సన్మానిస్తున్న సుందరయ్య పార్కు వాకర్స్ క్లబ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వివేక్, వెంకటస్వామి

జనసేన ఎమ్మెల్యే సత్యనారాయణకు ఆత్మీయ సత్కారం

రాంనగర్ ,జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గెలుపొందిన గిడ్డి సత్యనారాయణ హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లికి చెందిన నివాసి. ఆయన నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో అకౌంట్ ఆఫీసర్‌గా పనిచేశారు. తన పదవీ విరమణకు సంవత్సరన్నర కాలానికి ముందే స్వచ్ఛంద పదవీ విరమణ చేసి జనసేన అధినేత పవన్ కళ్యాన్ అధ్వర్యంలో పార్టీలో చేరారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆయన ఏపీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గన్నవరం నియోజకవర్గం నుంచి పోటీ చేసి వైసీపీ అభ్యర్థిపై దాదాపు 35వేల పై చిలుకు ఓట్ల మెజార్టీతో ఆయన విజయం సాధించారు.

ఎమ్మెల్యేగా గెలిచిన గిడ్డి సత్యనారాయణకు బాగ్‌లింగంపల్లి ఎంఐసీ క్వార్టర్స్ వాసులు కాసాని ఆనంద్, లోకేష్‌యాదవ్, రాయపాటి రవి, శేఖర్, శ్రీదర్‌యాదవ్, నరేష్, ప్రేమ్, జబ్బార్ కిషన్‌రావు ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం జరిగింది. సోమవారం ఉదయం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం జరిగింది. కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు ఆర్ వివేక్, వెంకటస్వామి, ప్రకాష్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొని ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాగ్‌లింగంపల్లితో తనకు 30 ఏళ్ల అనుబంధం ఉందని అన్నారు.



స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ సిబ్బందికి ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

బర్కత్‌పుర, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వర్షా కాలంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే ప్రమాదాలు తప్పవని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి. శంకర్‌రాజు అన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించి ప్రమాదాలను నివారించాలని సూచించారు. సోమవారం రాష్ట్ర ఫైనాన్షియల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బందికి ట్రాఫిక్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షా కాలంలో వాహనాలు చాలా జాగ్రత్తగా నడపాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. తెరచి ఉంచిన మ్యాన్‌హోల్స్ వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని మితిమీరిన వేగంతో వాహనాలు నడపవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏపీ ఎస్ఎఫ్‌సీ తెలంగాణ డివిజన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ ఎం.శ్రీనివాస్, పద్మాకర్‌రావు, జనరల్ మేనేజర్ పాండురంగరాజు, ట్రాఫిక్ ఎస్ఐ ఆర్.పాండు తదితరులు పాల్గొన్నారు.



సెలెక్ట్ అయిన అభ్యర్థులతో బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేష్

పోలీస్ కానిస్టేబుళ్లకు వెంటనే శిక్షణ ఇవ్వాలి

- ట్రైనింగ్ ఐజీకి నీల వెంకటేష్ వినతి

బర్కత్‌పుర, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సెలెక్ట్ అయిన పోలీస్ కానిస్టేబుల్స్‌కు వెంటనే శిక్షణ ఇవ్వాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేష్ డిమాండ్ చేశారు. ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వం 80 లక్షల బడ్జెట్‌ను కేటాయించాలని ఆయన కోరారు. సోమవారం డీజీపీ కార్యాలయంలో ట్రైనింగ్ ఐజీ అభిలాష్ బిస్త్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 150 మంది పోలీస్ కానిస్టేబుల్స్ సెలెక్ట్ కాగా వారిలో కేవలం 70 మందికి మాత్రమే శిక్షణ ఇచ్చారని తెలిపారు. ఏఆర్ 31 మంది, సివిల్ 34 మంది, జనరల్‌లో 15 మంది సెలెక్ట్ అయిన కానిస్టేబుల్స్ శిక్షణ పొందాల్సి ఉందని, శిక్షణ గ్రౌండ్ బడ్జెట్ లేదనే సాకుతో వారికి ఇంత వరకు శిక్షణ ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం బడ్జెట్ కేటాయిస్తే శిక్షణ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని ట్రైనింగ్ ఐజీ తెలిపారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని కానిస్టేబుల్స్‌కు శిక్షణ ఇప్పించాలని లేకపోతే అనర్హులుగా పరిగణించబడే ప్రమాదం ఉందన్నారు.

కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన బండి సంజయ్‌ను సోమవారం ఢిల్లీలో కలిసిన మాజీ కార్పొరేటర్ వనం రమేష్ పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.
- నల్లకుంట, ఆంధ్రజ్యోతి





హెర్బల్ చాయ్‌పై మహిళలకు అవగాహన కల్పిస్తున్న అనిత లోకండే

హెర్బల్ చాయ్‌పై మహిళలకు అవగాహన

బర్కత్‌పుర, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): హెర్బల్ చాయ్‌పై మహిళలకు ఉచిత అవగాహన శిబిరాన్ని బర్కత్‌పురలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 51 రకాల హెర్బల్ చాయ్‌లను తయారు చేసి మహిళలకు అవగాహన పెంపొందించారు. శీతల పానీయాల కంటే హెర్బల్ చాయ్ ఆరోగ్యానికి మంచిదని తెలియజేయడానికే కార్యక్రమం నిర్వహించినట్లు అనిత ఎస్ లోకండే, అరుణజ్యోతి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బావాసార్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి సంగీత పటాలే, సభ్యులు అనుపమ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎంటీఎస్ రైలు నుంచి జారిపడి విద్యార్థి మృతి

బర్కత్‌పుర, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి ఎంఎంటీఎస్ రైలులో ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తూ ప్రమాదవశాత్తు ఓ డిగ్రీ విద్యార్థి జారిపడి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం బోయిగూడలో నివాసం ఉంటున్న జనసూర్య (20) డిగ్రీ పూర్తి చేశాడు. స్నేహితులతో కలిసి ఆదివారం రాత్రి ఫలక్‌నామాలో ఉన్న శ్రీకాళీమాత అమ్మవారిని దర్శించుకొని తిరిగి సికింద్రాబాద్ వెళ్లడానికి ఎంఎంటీఎస్ రైలు ఎక్కాడు. యాకత్‌పుర రైల్వే స్టేషన్ సమీపంలో ఫుట్‌బోర్డు చేస్తుండగా రైలు నుంచి జారి కిందపడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కాచిగూడ రైల్వే పోలీసులు తెలిపారు.

క్రీడా మైదానాలను అభివృద్ధి చేయాలి

- బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పూసగోరక్‌నాథ్

ముషీరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నిర్వాహణ లేక అధ్వానంగా మారిన జీహెచ్ఎంసీ క్రీడా మైదానాలను వెంటనే అభివృద్ధి చేయాలని బీఆర్ఎస్ ముషీరాబాద్ సీనియర్ నాయకుడు పూసగోరక్‌నాథ్ జీహెచ్ఎంసీ అధికారులను డిమాండ్ చేశారు. సోమవారం ముషీరాబాద్ డివిజన్ గంగపుత్ర కాలనీలోని జీహెచ్ఎంసీ వాలీబాల్ క్రీడామైదానాన్ని కాలనీ వాసులతో కలిసి గోరక్‌నాథ్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికే నీరు నిలిచి బురదమయంగా మారడంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జీహెచ్ఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కొన్ని సంవత్సరాలుగా గంగపుత్రకాలనీ క్రీడామైదానాన్ని అభివృద్ధి చేకపోవడంతో క్రీడాకారులు క్రీడలు ఆడలేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. క్రీడామైదానంలో సదుపాయాలను వెంటనే కల్పించాలని కోరారు. ఈ సమస్యను ఎమ్మెల్యే ముఠాగోపాల్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. కార్యక్రమంలో గంగపుత్ర కాలనీ సొసైటీ నాయకులు రమాకాంత్, శ్రీనివాస్, జగదీష్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.



బురద మయంగా మారిన గంగపుత్ర కాలనీ వాలీబాల్ మైదానాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నేత పూసగోరక్‌నాథ్, కాలనీ వాసులు

వాహనాల చోరీ.. ఓఎల్ఎక్స్‌లో విక్రయం

- నకిలీ ఆర్సీలు సృష్టించి.. రూ.10 వేల నుంచి 15 వేలకే..
- 14 వాహనాలు, ల్యాప్‌టాప్, నకిలీ ఆర్‌సీల స్వాధీనం
- ముగ్గురు నిందితుల అరెస్ట్

బోయినపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలను చోరీ చేసి, నకిలీ రిజిస్ట్రేషన్ నంబర్లు అమర్చి ఓఎల్ఎక్స్‌లో విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను బోయినపల్లి క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం విలేకరుల సమావేశంలో నార్త్‌జోన్ డీసీపీ రోహిణిప్రియదర్శిని వివరాలు వెల్లడించారు. సూరారంకాలనీ కుత్బుల్లాపూర్ అమిత్ బస్తీకి చెందిన రజాక్‌ఖాన్(38) బైక్ మెకానిక్. ఏలూరు కొండవోలె గ్రామానికి చెందిన యామాల యోహాను అలియాస్ యోహాను(29) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి మియాపూర్ హఫీజ్‌పేట్‌లో నివసిస్తూ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో రజాక్‌ఖాన్‌కు యోహానుతో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సులభంగా డబ్బు సంపాదించాలని ప్రణాళికలు రూపొందించుకున్నారు. 2023 నుంచి బోయినపల్లి తిరుమలగిరి, నాంపల్లి, జీడిమెట్ల, అల్వాల్‌తోపాటు హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ పరిధుల్లో తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో రోడ్లపై నిలిపి ఉన్న ద్విచక్రవాహనాలను చోరీచేస్తున్నారు. దొంగిలించిన వాహనాలను రెండు మూడు రోజులపాటు పోలీసులు గుర్తించని ప్రాంతాల్లో ఉంచేవారు.

కృష్ణాజిల్లా మచిలీపట్నంలో ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్ నిర్వహిస్తున్న గొరిపర్తి వెంకటప్పయ్య(28) ద్వారా నకిలీ ఆర్‌సీలను సృష్టించారు. దొంగిలించిన ద్విచక్ర వాహనాలకు నకిలీ రిజిస్ట్రేషన్లు చేసి ఓఎల్ఎక్స్ ద్వారా వాటిని రూ. 10 వేల నుంచి రూ.15 వేలకే విక్రయిస్తున్నారు. ఓఎల్ఎక్స్‌లో వాహనాలను కొనుగోలు చేసినవారు ఆర్‌సీ అడగడంతో వారు పొంతనలేని సమాధానాలు చెబుతున్నారు. అనుమానం వచ్చిన ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కేసు దర్యాప్తు ప్రారంభించగా.. రజాక్ ఖాన్, యోహాను, గొరిపర్తి వెంకటప్పయ్య ముఠాగా ఏర్పడి నకిలీ ఆర్సీలను సృష్టించి వాహనాలు విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా... నేరాన్ని అంగీకరించారు. వారి నుంచి 8 లక్షల విలువైన 14 ద్విచక్ర వాహనానలు, ల్యాప్‌టాప్, నకిలీ ఆర్‌సీ కార్డులను స్వాధీనం చేసుకున్నామని డీసీపీ తెలిపారు. కేసును ఛేదించిన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సర్దార్ నాయక్, ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, డీఎస్ఐ తుల్జారాం, ఎస్ఐ అనిల్, కానిస్టేబుళ్లు రమేష్, మురళి, శివశంకర్, మహేష్, శివకుమార్, శ్రీనివాసును డీసీతో, అదనపు డీసీపీ పి.అశోక్, బేగంపేట్ ఏసీపీ పి.గోపాలకృష్ణమూర్తి అభినందించారు.



స్వాధీనం చేసుకున్న వాహనాలు, నిందితుల అరెస్ట్‌ను చూపిస్తున్న డీసీపీ రోహిణి ప్రియదర్శిని

వర్షాకాలంలో నీరు నిల్వలేకుండా చూడాలి

- పని ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి
- వాటర్ బోర్డు ఎండీ సుదర్శన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురిసే సమయంలో డివిజన్ల వారీగా వాటర్ లాగింగ్, స్టాగ్నింగ్ పాయింట్లను గుర్తించి నీరు నిల్వ లేకుండా చూడాలని వాటర్ బోర్డు ఎండీ సుదర్శన్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో సోమవారం వర్షాకాల ప్రణాళికపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ... రోడ్లపై సివరేజ్ ఓవర్ ఫ్లో కాకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని, పని ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు, డీప్ మ్యాన్‌హోల్స్‌కు గ్రిల్స్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కలుషిత నీటిపై వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యమివ్వడంతోపాటు ఇతర వినతులను కూడా సకాలంలో పరిష్కరించాలన్నారు. వర్షాకాలంలో కలుషిత నీరు సరఫరా అయ్యే అవకాశం ఉన్నందున అధికారులు తగిన మోతాదులో క్లోరిన్ శాతం ఉండేలా చూసుకోవాలని సూచించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి జలమండలి ఏర్పాటు చేసిన చలివేంద్రాల్ని కొనసాగించాలని స్పష్టం చేశారు. కాగా, డివిజన్ల వారీగా పెండింగ్‌లో బిల్లులను ఎప్పటికప్పుడు వసూలు చేయాలని, నిర్దేశించిన లక్ష్యాలకతీతంగా పనిచేయాలని సూచించారు. గృహ వినియోగ దారులతో పాటు వాణిజ్య కనెక్షన్లపై దృష్టి సారించాలన్నారు. సమీక్షలో ఆపరేషన్స్ డైరెక్టర్-1 అజ్మీరా కృష్ణ, ఆపరేషన్స్ డైరెక్టర్-2 స్వామి, సీజీఎంలు, జీఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

మదీన, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ముగ్గురు నిందితులకు న్యాయస్థానం జీవిత ఖైదు విధించిందని బహదూర్‌పురా ఇన్‌స్పెక్టర్ ఆర్. రఘునాథ్ తెలిపారు. రమ్నాస్‌పురాకు చెందిన షేక్ ఖాలిద్(40), అదే ప్రాంతానికి చెందిన మహ్మద్ అన్వర్ అలియాస్ అన్ను(35), మహ్మద్ మునవ్వర్ అలీ అలియాస్ బబ్బు(30)కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లు. పాతకక్షల నేపథ్యంలో ముగ్గురూ 2017 జనవరిలో అదే ప్రాంతానికి చెందిన మన్సూర్ అనే వ్యక్తిని దారుణంగా హత్య చేశారు. కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సాక్ష్యాధారాలు సేకరించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన నాంపల్లి మెట్రోపాలిటన్ సెషన్ జడ్జి బి. సురేష్ నిందితులు ముగ్గురికీ జీవిత ఖైదు, ఒక్కొక్కరికి రూ. 25,500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై పోక్సో కేసు

మదీన, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఓ వ్యక్తిపై బండ్లగూడ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. అల్ జుబేర్ కాలనీకి చెందిన ఇక్బాల్(40) ఫిబ్రవరిలో ఓ బాలికపై అత్యాచారం చేశాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. బాలిక తల్లిదండ్రులకు ఇటీవల విషయం చెప్పగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు ఇక్బాల్‌పై పోక్సో కేసు నమోదు చేశారు.

రెండుచోట్ల రోడ్డు ప్రమాదాలు

- బస్సుల చక్రాల కిందపడి ఇద్దరి మృతి

రాజేంద్రనగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వేర్వేరు ప్రాంతాలలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదాలలో ఇద్దరు మృతిచెందారు. ఇన్‌స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చాంద్రాయణగుట్ట హషమాబాద్ ప్రాంతానికి చెందిన వార్థ బారామూద్(17) పీడీపీ చౌరస్తా నుంచి ఆరాంఘర్ మీదుగా స్కూటీపై వెళ్తోంది. ఆరాంఘర్ వద్ద గుర్తు తెలియని ప్రైవేటు బస్సు బాలిక పైనుంచి దూసుకెళ్లింది. దీంతో వార్థ బారామూద్ అక్కడికక్కడే మరణించింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు. బాలిక బాబాయి సయ్యద్ యాయా బారామూద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చింతల్‌మెట్ రోడ్డులో..

చింతల్‌మెట్‌కు చెందిన పాండు(55) సోమవారం రోడ్డు దాటుతున్నాడు. కోఠి నుంచి రాజేంద్రనగర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అతడిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు అత్తాపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

15న శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా నేను సైతం గీతాలాపన

చిక్కడపల్లి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ప్రముఖ మహిళా సంస్థ రాగరాగిణి ఆధ్వర్యంలో ఈనెల 15న సాయంత్రం త్యాగరాయగానసభలో శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా నేను సైతం పేరిట శ్రీశ్రీ సినీ గీత విభావరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రమణ కుమారి, సుబ్బలక్ష్మి తెలిపారు.



కళాకారులను సత్కరించిన అతిథులు

విద్యార్థులను కళా రంగాల్లో ప్రోత్సహించాలి

రవీంద్రభారతి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ కళలు మన సంస్కృతికి నిదర్శనమని వక్తలు పేర్కొన్నారు. సంస్కృతి సర్వీసెస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలుగు వర్సిటీలోని ఆడిటోరియంలో సంస్కృతిక కళారాధన పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. చిన్నారి కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు ప్రేక్షకుల్ని రంజింపజేశారు. చక్కటి అభినయంతో చిన్నారులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో డా.అరిపిరాల కళ్యాణ్ శాస్త్రి, నటుడు జెమినీ సురేష్, వెంకట గిరిధర్, నటి గీతా సింగ్, అనుపమ, తదితరులు పాల్గొని కళాకారులను సత్కరించి అభినందించారు. విద్యార్థులు విద్యతో పాటు కళారంగాల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని అన్నారు. చిన్నారి కళాకారులందరూ భవిష్యత్తులో గొప్ప స్థాయికి చేరుకోవాలని అన్నారు. కళా సంస్థలు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి కళాకారులను ప్రోత్సహించాలని అన్నారు.



కళాకారులతో అతిథులు

కళలు సంస్కృతికి నిదర్శనం

రవీంద్రభారతి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అన్నమాచార్య జయంతి సందర్భంగా సరసిజ థియేటర్, లేఖిని రచయిత్రుల వేదిక సంయుక్తాధ్వర్యంలో అన్నమాచార్య సంకీర్తనల ఆలాపన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గాయకులు అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. ముఖ్య అతిథులుగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, రసమయి సంస్థ అధినేత రాము, కలగ కృష్ణమోహన్, పొన్నాడ ప్రసాద్ తదితరులు పాల్గొని కళాకారులను సత్కరించి అభినందించారు. తెలుగు జాతి ఉన్నంత కాలం అన్నమాచార్య కీర్తనలు బతికుంటాయని అన్నారు. కళలు మన సంస్కృతికి నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో సరసిజ అధ్యక్షురాలు అత్తలూరి విజయలక్ష్మి, జొన్నవిత్తుల సాయి మాధురి, ధనలక్ష్మి, అల్లూరి గౌరీలక్ష్మి, నండూరి సుందరీ, నాగమణి, సరస్వతీ కరవది, షమీర్, జానకి, తదితరులు పాల్గొన్నారు.



ఇండియన్ స్కౌట్, గైడ్ ఫెలోషిప్ కమిటీ సభ్యులు

రాష్ట్ర ఇండియన్ స్కౌట్స్, గైడ్స్ ఫెలోషిప్ కార్యవర్గం ఎన్నిక

సికింద్రాబాద్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఇండియన్ స్కౌట్స్ గైడ్స్ ఫెలోషిప్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సికింద్రాబాద్‌లోని అక్షర వాగ్దేవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం ఎస్‌జీఎఫ్ డోనర్, జీవిత కాల సభ్యుడు పీఎల్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో కమిటీ చార్టర్‌ను ప్రవేశపెట్టి నూతన సభ్యులను ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా మక్ మెక్కి, నేషనల్ కౌన్సిల్ సభ్యురాలిగా వాణి, రాష్ట్ర అధ్యక్షుడిగా మలయాద్రి, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా అక్షరవాగ్దేవి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ వనజ, రాష్ట్ర ఖజానా అధికారిగా బీఎన్ రావు, రాష్ట్ర కార్యదర్శిగా జూహి, జనరల్ సెక్రటరీగా సీమ రాణి, జాయింట్ సెక్రటరీగా థెరిస్సా, కౌన్సిల్ సభ్యురాలిగా కనకదుర్గ, రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా మొహమ్మద్ ఖాసిం, మల్కాజిగిరి నుంచి సభ్యుడిగా భాస్కర్‌రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి మహిళల గిల్డ్ సభ్యురాలిగా డాక్టర్ నూరి మెహరున్నీసాను ఎన్నుకున్నట్లు పీఎల్ శ్రీనివాస్ ప్రకటించారు.



డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ, ముఠా జైసింహ

డ్రైనేజీ పైప్‌లైన్ పనుల పరిశీలన

కవాడిగూడ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్‌లోని పూల్‌బాగ్ కూచిపూడి వద్ద డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ, బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు ముఠా జైసింహ అధికారులకు సూచించారు. పూల్‌బాగ్ కూచిపూడి ప్రాంతంలో ఉంటున్న ప్రజలు నిత్యం డ్రైనేజీలు నిండి ఇబ్బందులుపడుతున్నారని అన్నారు. సోమవారం కార్పొరేటర్ రచనశ్రీ, ముఠాజైసింహ, వాటర్‌వర్క్సు అధికారులతో కలిసి కూచిపూడివద్ద జరుగుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు రాజకీయాలకతీతంగా సహకరించాలని వారు కోరారు.

కార్యక్రమంలో వాటర్‌వర్క్సు అధికారులు కార్తీక్‌రెడ్డి, శ్రీధర్‌తోపాటు బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మహేందర్‌బాబు, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ గంగపుత్ర, బీఆర్ఎస్ నగరనాయకులు కల్వగోపి, కవాడిగూడ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్యామ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ఓపెన్ ఆడిటోరియం ఎదుట చదువుకుంటున్న నిరుద్యోగ యువత

ఓపెన్ ఆడిటోరియం ఎదుట చెత్తాచెదారం

చిక్కడపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి సిటీసెంట్రల్ లైబ్రరీ ఓపెన్ ఆడిటోరియం ఎదుట చెత్తచెదారం పెరుకపోయింది. లైబ్రరీ ఆవరణలో ప్రతి నిత్యం నిరుద్యోగులు పోటీ పరీక్షల కోసం కుర్చీలు వేసుకుని చదువుకుంటుంటారు. అక్కడంతా అపరిశుభ్రత ఉండడంతో నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. లైబ్రరీ అధికారులు చర్యలు తీసుకుని ఓపెన్ ఆడిటోరియం ఎదుట శుభ్రం చేయాలని కోరుతున్నారు.

'తెలంగాణ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది'

చిక్కడపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగిన నరేంద్రమోదీ ప్రమాణస్వీకారోత్సవానికి బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని, అందులో భాగంగానే కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు కేంద్ర క్యాబినెట్‌లో అవకాశంకల్పించారన్నారు. మంత్రులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

కార్యకర్తల కృషితోనే బీఆర్ఎస్ బలోపేతం

చిక్కడపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల కృషితోనే బీఆర్ఎస్ బలోపేతం అవుతోందని ఆ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు ముఠా జైసింహ అన్నారు. బీఆర్ఎస్ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రాకేష్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ బలోపేతం చేయడంతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలు విరివిగా నిర్వహిస్తున్న పార్టీ సీనియర్ నాయకుడు, డివిజన్ మాజీ అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్ గుప్తాను సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జైసింహ సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు శ్రీకాంత్, ముఠానరేష్, ఆకుల శ్రీనివాస్, జీవై గిరి, రవి శంకర్‌గుప్త, ఎంబి కృష్ణ, బత్తుల కిరణ్‌కుమార్, ఎంబి కృష్ణ, కుమారస్వామి, రచ్చ నరేష్, సాయిచాణిక్యరెడ్డి, సాయియాదవ్, శ్యామ్‌యాదవ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా బాలకృష్ణ హ్యాట్రిక్ విజయం

రాంనగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని హిందూపురం నియోజకవర్గం ఎమ్మెల్యేగా బాలకృష్ణ హ్యాట్రిక్ సాధించడంతో దోమలగూడలోని టీడీపీ నగర కార్యాలయంలో టీడీపీ నేతలు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు సాయిబాబా మాట్లాడుతూ బాలకృష్ణ అటు ప్రజాప్రతినిధిగా, నటుడుగా, ఇటు పేదలు, కేన్సర్ రోగులకు ఈ కేన్సర్ ఆస్పత్రి ద్వారా సేవలందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి. బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు ప్రకాష్, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలకృష్ణ పుట్టిన రోజు

చిక్కడపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): హీరో బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకలను సోమవారం రాత్రి ఆర్టీసీ క్రాస్‌రోడ్ సుదర్శన్ 35ఎంఎం థియేటర్‌లో ఘనంగా నిర్వహించారు. మోక్షజ్ఞ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బాలకృష్ణ అభిమానులు పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా డీజేలు ఏర్పాటు చేసి బాలకృష్ణ డైలాగ్‌లు, నటించిన పాటలతో కూడిన రికార్డులు ఏర్పాటు చేసి హంగామా సృష్టించారు. అభిమాన సంఘం ప్రతినిధులు గోపాల్ గౌడ్, ప్రవీణ్, కట్టా శ్రీరాములు, కన్నప్ప, మురళి ముత్యాలు, కేఎన్ శర్మ, శ్రీనివాస్ కేబుల్, సురేష్, కార్తీక్‌లతోపాటు సుదర్శన్, దేవి థియేటర్‌ల మేనేజింగ్ పార్ట్‌నర్స్ విశ్వంభర్, బాల్‌గోవింద్‌రాజ్, మేనేజర్లు శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

చిలకలగూడ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చుతో శాస్త్రీయ సంగీత, నృత్యాలలో శిక్షణ ఇవ్వటానికి అన్నిచర్యలూ చేపట్టినట్లు శ్రీభక్త రామదాసు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల, మారేడుపల్లి, ప్రిన్సిపాల్ కె.వరలక్ష్మి తెలిపారు. కళాశాలలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గురువారం నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, నూతన విద్యా సంవత్సరం(2024-25)లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కర్నాటక, హిందుస్థానీ గాత్రం, కూచిపూడి, పేరిణి నాట్యం వీణ, వయోలిన్, మృదంగం, తబల వాయిద్యాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. దరఖాస్తులను కళాశాలలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పొందవచ్చన్నారు.

ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా వసంత్‌కుమార్



అడ్డగుట్ట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కోర్టుల్లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వై.వసంత్‌కుమార్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఎన్నికల్లో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సికింద్రాబాద్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉంటూ కోర్టులో నెలకొన్న సమస్యలతోపాటు అర్జీదారులు, న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెడతానన్నారు.